క్లుప్తంగా

జీఓ 117 రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

ధర్మవరం అర్బన్: నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను వెంటనే రద్దు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కలపాలని స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అన్నం సుధాకర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో 5 నుంచి 10వతరగతి వరకు ఆంగ్ల మాధ్యమంతో పాటు సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ఈ సంవత్సరం నుంచే కొనసాగించాలన్నా. గతంలో 75 రోలు కన్నా తక్కువ ఉన్న ఉన్నత పాఠశాలలో తొలగించిన ప్రధానోపాధ్యాయ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

చెన్నేకొత్తపల్లి: కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జీఓ 117ను వెంటనే రద్దు చేయాలని జిల్లా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. చెన్నేకొత్తపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లో కలపాలని డిమాండ్ చేశారు.

మూడో రోజూ న్యాయవాదుల దీక్ష

కదిరి టౌన్: కదిరి న్యాయవాది రామస్వామి నాయుడుపై దాడిని నిరసిస్తూ కోర్టు సమీపంలో గురువారం మూడో రోజూ న్యాయవాదులు నిరహార దీక్ష కొనసాగించారు. న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాదిపై దాడి చేసిన బీజేపీ నాయకుడు తలుపుల గంగాధర్‌పై కేసు నమోదు చేసినా ఇంకా అరెస్ట్ చేయలేదన్నారు. నిందితుడిని అరెస్ట్ చేయకపోతే అమర నిరాహార దీక్ష చేపడుతామన్నారు. ఈసందర్భంగా న్యాయవాదులకు పలు ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు.

అంతర్జాతీయ క్రీడాపోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న యశోద పాఠశాల ప్రతినిధులు

ధర్మవరం: అంతర్జాతీయ క్రీడాపోటీల్లో యశోద పాఠశాల విద్యార్థులు ప్రతిభచూపారని పాఠశాల డైరెక్టర్ పృధ్వీరాజ్, ప్రిన్సిపాల్ అనూప్‌లు తెలిపారు. గురువారం వారుక్రీడాకారులను అభినందించారు. అంతర్జాతీయ టార్గెట్‌బాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు తమ్మయి, చరణ్, యశ్వంత్‌కుమార్ ఇండియా టీంకు ప్రాతినిధ్యం వహించి రెండో స్థానం సాధించారన్నారు. వీరు ఈనెల 8 నుంచి 12 వరకు నేపాల్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు.

రాష్ట్ర కార్యవర్గంలో 'అనంత' డ్యాన్సర్లు

అనంతపురం కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్స్ మాస్టర్స్, డ్యాన్సర్స్ యూనియన్ (ఏపీఎఫ్‌టీడీడీయూ) రాష్ట్ర కార్యవర్గంలో అనంత డాన్స్ మాస్టర్లకు చోటు దక్కింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన సీనియర్ కొరియోగ్రాఫర్ లక్ష్మీకాంత్, కార్యవర్గ సభ్యుడిగా ధర్మవరం పట్టణానికి చెందిన డాన్స్‌మాస్టర్ వినోద్‌కుమార్ ఎంపికయ్యారు. తాడేపల్లిలో జరిగిన సమావేశంలో సినీ నిర్మాత రాజేంద్రప్రసాద్, సీనియర్ న్యాయవాది దుర్గాభవానీ, సమక్షంలో ఇటీవల కమిటీని ఎంపిక చేశారు.

వీల్‌చైర్ల పంపిణీ

చెన్నేకొత్తపల్లి: స్థానిక సీహెచ్‌సీ, ఎన్ఎస్ గేట్‌లోని పీహెచ్‌సీకి గురువారం వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన పరికరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు. చెన్నేకొత్తపల్లి సీహెచ్‌సీకి నాలుగు, ఎన్ఎస్‌గేట్ పీహెచ్‌సీకి రెండు వీల్ చైర్లను ఎంపీడీఓ మోహన్‌కుమార్ అందించారు. టీడీపీ మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, అమరేంద్ర పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థి మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో గురువారం ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి గోపాల్‌నాయక్ ఆధ్వర్యంలో వలంటీర్లు, విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, చిట్టెమ్మ, కిరణ్‌కుమార్, భువనేశ్వరి, పుష్పవతి, సరస్వతి, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

- సత్ఫలితాలనిస్తున్న ఓపెన్ జిమ్
- శరీర దారుఢ్యం పెంచుకుంటున్న యువకులు
- సెలవు రోజుల్లో చిన్నారులతో కిటకిటలాడుతున్న సెంటర్లు

ఆహ్లాదం...ఆరోగ్యం

ధర్మవరం: ఓపెన్ జిమ్ సెంటర్లు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని పంచుతున్నాయి. నేటి సమాజంలో విద్యార్థులు, యువకులు దేహదారుఢ్యం పెంచుకునేందుకు ప్రధాన మార్గం జిమ్ సెంటర్. అయితే జిమ్‌లలో నెలనెలా డబ్బు ఇచ్చి కసరత్తు చేయాలంటే పేద విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. పోలీస్, ఎక్సైజ్ శాఖలు తదితర ఉద్యోగాల కోసం ఫిజికల్ ఫిట్‌నెస్ సాధించాలంటే నిరుద్యోగులు డబ్బు ఇచ్చి జిమ్‌లకు వెళ్లాలంటే ఆర్థిక స్తోమత సహకరించదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పట్టణ ప్రాంతాలలో ఈ జిమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ జిమ్‌ల ద్వారా అధునాతన జిమ్ పరికరాలను ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో, ఎల్‌పీసర్కిల్, శివానగర్ పార్కులో, సుందరయ్యనగర్, ప్రియాంకనగర్, గాంధీనగర్, ఎల్‌పీ సర్కిల్, ఎల్‌సీకేపురంలో మొత్తం 8 దాకా ఓపెన్ జిమ్ సెంటర్‌లను ఏర్పాటు చేశారు. అహుడా నిధులతో ఒక్కో జిమ్ సెంటర్ రూ.9 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. అహుడా నిధులతో పాటు దాతల సహకారంతో మరిన్ని పరికరాలను అమర్చి అభివృద్ధి చేశారు. ఈ జిమ్‌ల ద్వారా నిరుద్యోగులు, పోలీస్, ఎక్సైజ్ పరీక్షలకు సమాయత్తమయ్యే వారు నిత్యం తెల్లవారు జామునే సాధన చేస్తున్నారు. యువకులు దేహదారుఢ్యం పెంపొందించుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. వయస్సు తేడా లేకుండా వృద్ధులు, మహిళలు, పిల్లలు సైతం జిమ్‌లకు రావడం వ్యాయామం చేయడం విశేషం. దీంతో ఓపెన్ జిమ్ సెంటర్లు జనసందోహంతో కిటకిటలాడుతున్నాయి.

సెలవు రోజుల్లో చిన్నారులు సందడి

ఓపెన్ జిమ్ సెంటర్ల వద్ద సెలవు రోజుల్లో చిన్నారుల సందడి అందరిని ఆకట్టుకుంటోంది. తల్లిదండ్రులు దగ్గరుండి జిమ్‌ను నేర్పిస్తుండటంతో కోలాహలం నెలకొంటోంది. నిత్యం పాఠశాలల్లో చదువుల ఒత్తిడితో నలిగిపోతున్న విద్యార్థులు ఈ ఓపెన్ జిమ్ సెంటర్ల వద్దకు వచ్చి ఊరట చెందుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు.



ఓపెన్ జిమ్ సెంటర్ వద్ద సాధన చేస్తున్న ప్రజలు



జిమ్ సెంటర్ వద్ద చిన్నారులు, విద్యార్థుల సందడి

క్రీడాకారులకు ఉపయోగకరం



క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు, క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతోంది. నిత్యం వారు క్రీడా సాధనతో పాటు జిమ్ చేసి దేహదారుఢ్యాన్ని పెంచుకుంటున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇవి ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నాయి.

–రమేష్, పీడీ, ధర్మవరం

పిల్లలకు ఒత్తిడి దూరం



ఇది వరకు సెలవు రోజుల్లో పిల్లల్ని ఆటవిడుపుకు ఎక్కడికి తీసుకు వెళ్లాలంటే దిక్కుతోచేది కాదు. పట్టణంలో ఓపెన్ జిమ్, యోగా సెంటర్లను ఏర్పాటు చేయడం వల్ల సెలవు రోజుల్లో పిల్లలను ఓపెన్ జిమ్ సెంటర్ల వద్ద ఆటలాడిస్తూ వారి ఆనందాన్ని చూస్తున్నాం. ఓపెన్ జిమ్ సెంటర్లు ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి.

–గుండా ఈశ్వరయ్య, చేనేత కార్మికుడు, ధర్మవరం

పథకాల అమల్లో పక్షపాతం వద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి

బత్తలపల్లి: సంక్షేమ పథకాలు అమల్లో పక్షపాతం చూపొద్దని ప్రజా ప్రతినిధులు అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉండగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఇప్పుడు పార్టీల పేరుతో పక్షపాతం చూపిస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. శాశ్వత ఆహ్వానితుడు గుర్రం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పక్షపాతంతో వ్యవహరిస్తూ మండల వ్యాప్తంగా వృద్ధులకు పింఛన్లు నిలిపివేశారన్నారు. తాము ఏ గ్రామంలోనైనా టీడీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలగించామా అని ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీఓ శివనాగప్రసాద్ మాట్లాడుతూ అధికారులు ఎవ్వరూ ఉద్దేశపూర్వకంగా చేయరని, వారికి క్షేత్రస్థాయిలో టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు చేసి ఉంటారన్నారు. తాము కూడా ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఇలా అధికారులపై ఒత్తిడి చేస్తే ఉద్యోగాలు చేసే పరిస్థితి ఉండదన్నారు. అంతకు ముందు మండల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. తహసీల్దార్ సమావేశానికి రాకపోవడం పట్ల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు, ఆర్‌ఓ ప్లాంట్లపైన చర్చించారు. చిత్రావతి నదిలో రోడ్డు వ్యర్థాలు వేశారని, వాటిని తొలగించాలని సర్పంచు కరుణాకర్‌నాయుడు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఉపాధ్యక్షులు సాకే పార్వతి, గజ్జల వెంగళరెడ్డి పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి

ధర్మవరం అర్బన్: బార్ కౌన్సిల్ నిబంధనలను నిరసిస్తూ మూడురోజులపాటు విధులను బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి గోపికృష్ణ, కోశాధికారి అబ్దుల్లా, వైస్ ప్రెసిడెంట్ కరీం తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం న్యాయవాదులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్(సీఓపీ) మంజూరు కోసం రూపొందించిన నిబంధనలను సరికాదన్నారు. న్యాయవాదుల మనోభావాలకు భంగం కలిగేలా బార్ కౌన్సిల్ వ్యవహరిస్తోందన్నారు. 2015 రూపొందించిన నిబంధనలను పూర్తిస్థాయిలో అమలు కావడంలేదన్నారు. సీఓపీ నిబంధనలపై 2024లో బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలు న్యాయవాదులకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. రెన్యూవల్ దరఖాస్తు రుసుం రూ.500 పెంచడం సరికాదన్నారు. ప్రాక్టీస్ ధ్రువీకరణలో భాగంగా ఐదు వకాలత్‌లు వేయాలని నిబంధనలు విధించడం సరికాదన్నారు. 10వ తరగతి నుంచి న్యాయశాస్త్రం వరకు సర్టిఫికెట్లు జత చేయాలని ఆదేశించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి



మంటలు ఆర్పే యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

ఎన్పీకుంట: సోలార్ పవర్ ప్లాంట్లలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆక్టోపస్ డీఎస్పీ రాజిరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్లాంట్‌ను గురువారం కదిరి డీఎస్పీ శ్రీలతతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పవర్ ప్రాజెక్ట్‌లోని అనుబంధ కంపెనీ అయిన ఎన్‌టీపీసీ సోలార్ పవర్ ప్లాంట్‌లోని పరిసరాలు, ఇన్వర్టర్ రూమ్‌లను పరిశీలించారు. అనంతరం సోలార్ పవర్ ప్రాజెక్ట్ లోని అనుబంధ కంపెనీలైన అయానా, అదానీ, స్ప్రింగ్ ఎనర్జీ కంపెనీల అధికారులతో సమావేశం నిర్వహించారు. కంపెనీలలో విధులు నిర్వహించే సెక్యూరిటీ గార్డులు, టెక్నీషియన్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్ని ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ సీఐ నీలకంఠ, ఎస్ఐ సోమశేఖర్, కదిరి డివిజన్ ఇంటెలిజెన్స్ ఎస్ఐ రాము, ఎన్పీకుంట తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎస్ఐ శ్రీధర్, కదిరి ఫైర్ ఎస్ఎఫ్ఓ మన్సూర్, ఎన్‌టీపీసీ ఏజీఎం కె.రామ్మోహన్, అరుణ్, అయానా, అదానీ, స్ప్రింగ్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం



ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జీలు, న్యాయవాదులు, కళాశాల విద్యార్థులు



కదిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి



పుట్టపర్తిలో ర్యాలీలో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి రాకేష్, న్యాయవాదులు

ధర్మవరం అర్బన్: హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి ప్రజలకు సూచించారు. పట్టణంలో గురువారం కోర్టు నుంచి పట్టణ పురవీధుల్లో బ్యానర్లు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు మోటారు వాహనాల చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ ద్విచక్రవాహనాలను ఎక్కువగా మైనర్లు నడుపుతుంటారన్నారు. వారు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కొత్త చట్టంలో అనేక శిక్షలు ఉన్నాయని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి గోపికృష్ణ, కోశాధికారి అబ్దుల్లా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి పేర్కొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని కోర్టు ఆవరణ నుంచి ద్విచక్రవాహనదారులకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని,ట్రాఫిక్ నియమాలను పాటించాలని బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు లింగాల లోకేశ్వర్ రెడి, దశరథనాయక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ద్విచక్ర వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జూనియర్ సివిల్ జడ్జి కే.రాకేష్ పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తిలో మండల న్యాయ సేవాధికార సమితి ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై కోర్టు ప్రాంగణం నుంచి గణేష్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి రాజేష్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో అనేక మంది మృత్యువాత పడుతున్నారన్నారు. పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, న్యాయమాదులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, నిడిమామిడి శ్రీనివాసులు, లెక్కల యదుభూషన్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, ఇందిర, నాగేంద్ర, సివిల్ క్లర్క్ మంజూనాథ్ ఎంఎల్ఓ లక్ష్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పీర్ల ఊరేగింపు



గొల్లపల్లిలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

తాడిమర్రి: మండలంలోని పిన్నదరి గ్రామంలో గురువారం గ్రామస్తులు పీర్ల ఊరేగింపు వైభవంగా సాగింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కుల్లాయస్వామి, బాదుల్ స్వామి, కాశీంస్వామి, దస్తగిరి స్వామి తదితర పీర్లకు ముల్లాసాబ్ నూతన వస్త్రాలు కట్టి, వెండి గొడుగులు, పూలతో అలంకరించారు. సాయంత్రం పీర్లను అగ్ని గుండం ప్రవేశం చేయించి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు చెక్కెర, బెల్లం చదివింపులు చదివించారు.

బత్తలపల్లి: మండలంలోని ఈదుల ముష్టూరు, డి.చెర్లోపల్లిలో గురువారం పీర్ల జలధి కార్యక్రమాన్ని జరిగింది. గ్రామ సమీప ప్రదేశాలకు పీర్లను ఊరేగింపుగా తరలించి అక్కడ ముజావర్లు వాటిని నీటితో కడిగి తిరిగి పీర్ల చావిడికి తరలించారు. వాటిని పీర్ల మకాన్‌కు తరలించే సమయంలో ఆల్‌బీదాయే అనే విషాద గీతాన్ని ఆలపిస్తూ దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఆయా గ్రామాల్లో ఆదివారం జార్తాల్ వేడుకలు నిర్వహించనున్నారు.

గాండ్లపెంట: గొల్లపల్లి గ్రామంలో గురువారం మౌలాలీ ఉరుసు పీరు మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పీరును వివిధ రకాల పూలమాలలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు చెక్కర చదివింపులు చేయించుకుని మొక్కును తీర్చుకున్నారు.

తలుపుల: మండల కేంద్రంలో గురువారం మస్తాన్‌వలి పీరు ఉరుసు ఘనంగా జరిగింది. తొలుత కమిటీ సభ్యులు మేళాలు, తప్పెట్లతో ఊరేగింపుగా వెళ్లి తోటం శెట్టి వంశస్తులను ఆహ్వానించి కోటలోని పీరు గురువు సమాధి వద్ద నుంచి పీరును ఎత్తారు. అనంతరం స్టేషన్ బజార్ మీదుగా మెయిన్ బజార్ వరకు ఊరేగింపుగా వచ్చి పీర్ల చావిడిలో కొలువుదీరింది. రాత్రి చావిడి ముందు గుండం ఏర్పాటు చేసి వివిధగ్రామాల నుంచి వచ్చిన యువత అల్లావ్ తొక్కారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

తనకల్లు: ఆశా కార్యకర్తలకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం కొక్కంటి పీహెచ్‌సీలో వైద్యాధికారి లోకేశ్వర్ రెడ్డికి మండల ఆశా కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎల్‌సీడీసీ(హాన్సన్ వ్యాధి) సర్వే మొత్తాన్ని మూడేళ్లుగా చెల్లించలేదన్నారు. ప్రస్తుతం మళ్లీ ఎల్‌సీడీసీ సర్వే చేయాలని వైద్య, ఆరోగ్య శాఖాధికారులు ఆదేశాలు ఇచ్చారని, కానీ మూడేళ్ల బకాయిలను చెల్లించిన తర్వాతే సర్వేలో పాల్గొంటామన్నారు.

మంత్రిని కలిసిన మోడల్‌స్కూళ్ల ప్రిన్సిపాళ్లు

పుట్టపర్తి అర్బన్: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మను గురువారం పుట్టపర్తి మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, చెర్లోపల్లి ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ కలిశారు. పెనుకొండలోని మంత్రి కార్యాలయంలో ఆమెను కలిసిన వారు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పాఠశాలల్లో సుమారు 600 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, పాఠశాలకు సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు చెప్పారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ముదిగుబ్బ: స్థానిక కేజీబీవీలో గురువారం చిత్తూరు జిల్లాకు చెందిన ఎండీహెచ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయం నాదే కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023–23 విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులను సంస్థ చైర్మన్ ఎండీహెచ్ పవన్ కళ్యాణ్, పాఠశాల ఎస్ఓ పక్రుబీ అందించారు. సంస్థ సెక్రటరీ రోహిత్ కుమార్, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించండి



విద్యార్థినులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

ఎన్పీకుంట: స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జెడ్పీ సీఈఓ, సమగ్ర శిక్ష ఇన్‌చార్జ్ ఏపీసీ వైకోం నిదియాదేవి కేజీబీవీ ఉపాధ్యాయినులకు సూచించారు. కేజీబీవీని గురువారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులను, భోజనశాలను పరిశీలించారు. పాఠశాలలోని రెండు తరగతి గదులకు తాళం వేసి ఉండటాన్ని గమనించిన సీఈఓ తలుపులు తెరిచి చూడగా వాటిలో నాడు-నేడు కు సంబంధించిన మెటీరియల్ కనిపించడంతో సిబ్బందిపై మండిపడ్డారు. వాటికి సంబంధించిన రికార్డులు చూపించకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. 24 గంటల లోగా మెటీరియల్‌ను తీసివేసి తరగతి గదులను శుభ్రపరచాలని సూచించారు. అనంతరం విద్యార్థినుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఇన్‌చార్జ్ జీసీడీఓ సంపూర్ణ, సర్వశిక్ష అభియాన్ ఈఈ శంకరయ్య, జే ఈ రషీద్, ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ రాణెమ్మ, సీనియర్ అసిస్టెంట్ లోకా మల్లికార్జునరెడ్డి, కేజీబీవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ పావని తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి

ఎన్పీకుంట/ కదిరి టౌన్/ ధర్మవరం రూరల్ : 2023 ఖరీఫ్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు పంట నష్ట పరిహారాన్ని అందించాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఎన్పీకుంట, కదిరి, ధర్మవరం మండలాల్లోని పలు గ్రామ సచివాలయాల సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ మోటర్లకు మీటర్లు పెట్టించేందుకు తెచ్చిన జీఓ 22ను రద్దు చేసి, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నారు. ఉపాధి హామీ కింద ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో రైతు సంఘం అధ్యక్షులు బడా సుబ్బిరెడ్డి, నాయకులు నాగిరెడ్డి, గంగిరెడ్డి, నాగరాజు. జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్ బాషా, జీవీ రమణ, శేషంపల్లి మారుతి, చేనేత నాయకులు నరసింహులు, సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, ఓబుళేసు, సంజీవప్ప ఆంజనేయులు, జగన్, మహబూబ్‌బాషా, తిప్పన్న పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

నల్లమాడ: యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం పుట్టపర్తి కోఆర్డినేటర్ ఎం. జాన్సన్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య తెలిపారు. ఏఓ సుమతితో కలసి గురువారం వారు వంకరకుంట, బాపనకుంట గ్రామాల వద్ద వేరుశనగ, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఆయా పంటలకు ఆశించిన తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలను తెలియజేశారు.

ఇసుక రీచ్ పరిశీలన

ముదిగుబ్బ: ఉప్పలపాడు ఇసుక రీచ్‌ను గురువారం ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, వీఆర్‌ఓ నాగరాజులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిల్వ ఉన్న ఇసుక, రిజిష్టర్‌లో నమోదైన స్టాకు వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఏకాదశి పూజలు



కొత్తదేవరపల్లిలో లక్ష్మీచెన్నకేశవ స్వామి వద్ద భక్తుల సందడి

పుట్టపర్తి అర్బన్: జగరాజుపల్లి వద్ద కొండపై వెలసిన ఓబుళేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన ఏకాదశి పూజలు గురువారం ముగిశాయి. భక్తులు కాలి నడకన కొండపైకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల నుంచి భక్తులు పన్నేరపు బండ్లతో తరలివచ్చారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోవిందప్ప, సూర్యనారాయణరెడ్డి, ఉమాపతి పర్యవేక్షించారు.

కొత్తచెరువు: కొత్తచెరువు, దేవరపల్లి, ఎర్రబల్లి, ఓబుళదేవరపల్లిలో గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తదేవరపల్లిలో లక్ష్మీచెన్నకేశవ స్వామి గుడిలో స్వామిని ప్రత్యేకంగా అలకరించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని దర్శించుకునేకు భక్తులు వేలాది మంది రావడంతో ఆలయం కిటకిటలాడింది. సాయంత్రం గుడిచుట్టూ ఎడ్లబండ్లు తిప్పారు. కొత్తచెరువులోని సంగమేశ్వర స్వామి, నాగుల కనుమ వద్ద ఎడ్లబండ్లు ఊరేగించారు. ఎర్రబల్లి సమీపంలోని అమాసమ్మకు, నేరేడు కొండపై వెలసిన వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఓబుళదేవరపల్లి గ్రామంలో భక్తులు ఓబుళేశుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

తనకల్లు: డీ. చెక్కవారిపల్లిలో గురువారం ఏకాదశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేంకటేశ్వరున్ని గజమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉపవాసాలతో వేడుకలను ప్రారంభించారు. గురువారం ఉదయమే దేవాలయంలోని స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. బెంగళూరు నుంచి తీసుకువచ్చిన ప్రత్యేక పుష్పాలతో స్వామి వారి ఉత్సవ విగ్రహంతో పాటు మూల విరాట్‌ను అలంకరించి పూజలు చేశారు. ఉమ్మడి అనంతపురము జిల్లా నుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్నదానం నిర్వహించారు. అలాగే యర్రజిన్నన్నగారిపల్లి సమీపంలో ఉన్న కొండపై వెలసిన నరసింహస్వామి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండకింద పరుష నిర్వహించారు.

కనుమ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ...

చెన్నేకొత్తపల్లి మండలం పైలబోయలపల్లి గ్రామ సమీపంలో కొండల నడుమ వెలసిన కనుమ వెంకటస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర స్వామివార్ల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.